# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 15 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 20 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :15 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 20 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

**ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను: విశాఖలో చంద్రబాబు ఎమోషనల్**

- విశాఖలో 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మీ ఇంటిపై సర్వ హక్కులు మీవేనని సీఎం చంద్రబాబు భరోసా
- విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని భారీ ప్రకటన
- గోదావరి జలాలతో నగర నీటి కష్టాలు శాశ్వతంగా తీరుస్తామని హామీ
- గత ప్రభుత్వ పాలనలో భూ కబ్జాలు, కూల్చివేతలపై తీవ్ర విమర్శలు






పెన్ పవర్ డెస్క్:విశాఖ నగరంలోని వేలాది పేద కుటుంబాల దశాబ్దాల కల నెరవేరింది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం ద్వారా 28,445 కుటుంబాలకు వారు నివసిస్తున్న ఇళ్లపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. శనివారం విశాఖలో జరిగిన సభలో ఆయన లబ్ధిదారులకు

- మిగతా 2లో



## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్
- రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం
- మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ
- తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన

పెన్ పవర్ డెస్క్:ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.పర్యటనలో భాగంగా

- మిగతా 2లో



## ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి


- మంగళగిరిలో మహిళల ఏపీఎల్ ప్రారంభంపై మంత్రి లోకేశ్ హర్షం
- ఏపీ అమ్మాయిలు జాతీయ జట్టుకు ఆడాలన్నదే లక్ష్యమని వెల్లడి
- ట్రోఫీని ఆవిష్కరించిన నారా బ్రాహ్మణి, బ్రాండ్ అంబాసిడర్ మిథాలీ రాజ్
- వేదిక కల్పించిన ఏసీఏకు లోకేశ్ అభినందనలు
- ఏపీ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు వస్తారని ఆశాభావం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెటర్లు జాతీయ జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన ఆకాంక్ష అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మహిళా క్రికెటర్ల కలల ను సాకారం చేసేందుకు తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) ఒక బలమైన వేదిక అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.శనివారం సాయంత్రం మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోర్నమెంట్ ట్రోఫీని నారా బ్రహ్మణి, భారత మహిళా క్రికెట్ దిగ్గజం, టోర్నీ బ్రాండ్ అంబాసిడర్ మిథాలీరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు.ఈ టోర్నీ ప్రారంభంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తన

- మిగతా 2లో

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ సూచన



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ

- మిగతా 2లో

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- హుబ్బళ్లి పర్యటనలో అస్వస్థతకు గురైన అమిత్ షా
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గైర్హాజరు
- వైద్యుల సూచన మేరకు హోటల్‌లోనే విశ్రాంతి
- ఆయన స్థానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



పెన్ పవర్ డెస్క్:కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుబ్బళ్లిలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమానికి ఆయన హాజరు కాలేకపోయారు. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆయన హోటల్‌కే పరిమితమయ్యారు. హుబ్బళ్లిలోని కేఎల్ఈ జగద్గురు గంగాధర్

- మిగతా 2లో



## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

- మిగతా 2లో



## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

### రెండు లక్షల మంది భక్తులతో పోటెత్తిన మాఢవీధులు

- శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ
- గరుడ వాహనంపై భక్తులను కటాక్షించిన మలయప్ప స్వామి
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు
- గోవింద నామస్మరణలతో మార్మోగిన తిరుమల కొండ
- భక్తుల కోసం టీటీడీ భారీ ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ

పెన్ పవర్ డెస్క్:తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ

- మిగతా 2లో



## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

- తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చిందంటూ పేర్ని నాని ధ్వజం
- సూపర్ సిక్స్ హామీలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శ
- ప్రజల నుంచి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరిక

- మిగతా 2లో

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం
- 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం
- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ

- మిగతా 2లో



## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

పెన్ పవర్ డెస్క్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధి తులకు సాయమందించి కేంద్ర మంత్రి బండి సంజయ్ మానవత్వం చాటుకున్నారు. రాజీవ్ రహదారిలో ఓ కారు సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. భర్త డ్రైవింగ్ చేస్తుండగా.. భార్య ముందు సీట్లో, కుమార్తె వెనుక సీట్లో కూర్చున్నారు. ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో దంపతులకు ప్రాణాపాయం తప్పింది. వెనుక సీట్లో ఉన్న కుమార్తె తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి.

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## జగన్ నిర్ణయం మార్చుకున్నారా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజీపడుతున్నారా? తన నైజాన్ని పక్కన పెట్టి వచ్చే ఎన్నికల్లో విజయం కోసం నిర్ణయాలను మార్చుకోవాలని భావిస్తున్నారా? అంటే నిజమేనని అంటున్నారు. వైసీపీ నుంచి వీడిన నేతలను తిరిగి చేర్చుకునేందుకు జగన్ సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. వైసీపీ నుంచి వీడిన కొందరు కీలక నేతలను తిరిగి పార్టీలోకి చేర్చుకునేందుకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత పలువురు సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత మారుతున్న సమీకరణాల నేపథ్యంలో, వీరిలో కొందరు నాయకులు తిరిగి పార్టీలోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

**రీ-ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారా?**

పార్టీ వీడిన కొందరు కీలక స్థానిక నాయకులను, మాజీ మంత్రులను తిరిగి చేర్చుకోవడం ద్వారా క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చని వైఎస్ జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. గతంలో వ్యతిరేకించినప్పటికీ, మారుతున్న పరిస్థితుల్లో కొందరు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మళ్లీ జగన్ వైపు మొగ్గు చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడంపై అధినేత ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో భీమవరం నుంచి గెలిచిన గ్రంధి శ్రీనివాస్ లాంటి నేతల రీ-ఎంట్రీ గురించిన చర్చలు పార్టీ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇతర పార్టీలోకి వెళ్లిన నేతలు అక్కడ సంతృప్తికరంగా లేకపోవడం, తగిన ప్రాధాన్యత లేకపోవడంతో తిరిగి ఫ్యాన్ గూటికి చేరడంపై కొందరు ముఖ్య వైసీపీ నేతలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతుంది. అయితే ఇందులో ఎవరు వస్తారు? ఎవరిని తిరిగి పార్టీలోకి తీసుకోవాలి? అన్న విషయంపై జగన్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం.

**పార్టీని బలోపేతం చేసే వ్యూహమే...**

ఇతర పార్టీల నుంచి లేదా సొంత గూటికి తిరిగి వచ్చే నేతల వల్ల పార్టీకి మైలేజీ పెరిగి, స్థానికంగా బలం చేకూరుతుందనుకుంటే ఖచ్చితంగా తలుపులు తెరిచే ఉంచాలనే సంకేతాలు పార్టీ అంతర్గత సమావేశాల్లో వ్యక్తమయ్యాయి. ఒకవైపు పార్టీ వీడుతున్న నేతలను ఆపుతూనే, మరోవైపు పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకునేందుకు, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు జగన్ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. అయితే, ఇప్పటివరకు ఈ నాయకుల రీ-ఎంట్రీలపై పార్టీ పరంగా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, కొందరు మాజీ నేతలు మాత్రం వైఎస్ జగన్‌తో టచ్‌లోకి వెళ్లినట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే పార్టీ క్లిష్ట సమయంలో వీడిన నేతలను తిరిగి చేర్చుకోవడంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అలా చేర్చుకున్నందువల్ల పార్టీ పట్ల నిబద్ధత, అంకిత భావం కొరవడుతుందని, కష్టమైనా, నష్టమైనా నమ్ముకున్న వాళ్లకే అవకాశమివ్వాలన్న వాదన కూడా వినపడుతుంది. మరి జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది. జగన్ అనివార్య పరిస్థితుల్లో రాజీ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. మరి ఈ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయో, స్థానిక ఎన్నికల్లో వైసీపీ ఏ విధంగా నిలదొక్కుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- మొదటి పేజీ తరువాయి

సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

- మొదటి పేజీ తరువాయి

లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.

**భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు.

**టీటీడీ ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు తిరుమలలోని 8 కీలక ప్రాంతాల్లో సెక్టోరల్ అధికారులుగా విధులు నిర్వర్తించారు. వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు విశిష్ట ప్రాధాన్యం ఉంది. జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక అయిన గరుత్మంతునిపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పలువురు టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర దేవి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

# పేదల ఆనందం చూసి నా జీవితం ధన్యమైంది

- మొదటి పేజీ తరువాయి

కన్వీనియన్స్ డీడ్స్ అందజేశారు. ఈ నిర్ణయంతో వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామని అన్నారు. వేలాది కుటుంబాల దశాబ్దాల కల సాకారమైన వేళ వారి ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందాన్ని చూసి, "మీ ముఖాల్లో ఈ ఆనందం చూస్తే నా జీవితం ధన్యమైంది. నా ప్రాణం ఉన్నంతవరకు ఈ క్షణాన్ని గుర్తుపెట్టుకుంటాను" అంటూ చంద్రబాబు భావోద్వేగంతో ప్రసంగించారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, పేద ప్రజల ఆత్మగౌరవానికి, వారి పిల్లల భవిష్యత్తుకు చేస్తున్న పట్టాభిషేకం అని ఆయన అభివర్ణించారు.

**దశాబ్దాల నిరీక్షణకు తెర.. సర్వ హక్కులు మీవే!**

"కూడు, గూడు, గుడ్డ అనేది మా విధానం. 40 ఏళ్ల క్రితమే ఎన్టీఆర్ పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని సంకల్పిస్తే, అదే స్ఫూర్తితో మేము పనిచేస్తున్నాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. దశాబ్దాలుగా సొంత కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లలో నివసిస్తున్నా, వాటిపై పూర్తి హక్కు లేదనే వేదనతో జీవిస్తున్న లక్షలాది మందికి ఈ పట్టాభిషేకం ద్వారా విముక్తి కల్పించామన్నారు. "నిన్నటి వరకు మీ ఇంటిపై మీకు హక్కు లేదు. కానీ ఈరోజు నుంచి మీ ఇంటి మీద సర్వ హక్కులు మీవే. ఇకపై అనుమానం లేదు, వివాదం లేదు, భయం లేదు. తిరుగులేని హక్కు మాత్రమే ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖ నగర పరిధిలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, గోపాలపట్నం సహా 111 మండలాల్లోని 399 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 19.33 లక్షల చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, రూ. 8,874 కోట్ల రిజిస్ట్రేషన్ విలువైన ఆస్తిని ప్రజలకు అప్పగించామని తెలిపారు. "నిన్నటి వరకు అప్పు కావాలంటే గ్యారెంటీ లేని మీరు, ఈరోజు ఈ ప్రభుత్వం ఇచ్చిన పట్టాతో ఏ బ్యాంకులోనైనా స్వేచ్ఛగా రుణం పొందవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు.

**మిగిలిన వారికీ త్వరలోనే పట్టాలు.. అధికారులకు ఆదేశాలు**

ఈ కార్యక్రమంతోనే ఆగమని, వివిధ కారణాలతో ఆగిపోయిన మరో 35 కాలనీల్లోని 10,000 కుటుంబాలకు, వివాదాల్లో ఉన్న పంచగ్రామాల పరిధిలోని 12,149 మందికి కూడా త్వరలోనే పట్టాలు అందించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు. "దేవాలయ భూముల వివాదాలను కోర్టుల ద్వారా పరిష్కరించి, వీలైనంత తొందరగా మీ అందరికీ న్యాయం చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది" అని ఆయన కలెక్టర్‌కు వేదిక నుంచే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న ప్రతి పేదవాడికీ హక్కు పత్రాలు అందించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

**దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినట్టే!**

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్లు ఒక పీడకల. రూ. 10 లక్షల కోట్ల అప్పులు, ఎక్కడ చూసినా కుంభకోణాలు, భూకబ్జాలు, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో అలజడి సృష్టించారు. శుక్రవారం వచ్చిందంటే ఏ ఇంటిని కూలుస్తారో తెలియని భయానక వాతావరణం ఉండేది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "విశాఖను రాజధాని చేస్తామంటూనే, రుషికొండపై ఋషులు తపస్సు చేసిన చోట ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ఆ ప్యాలెస్‌ను ఏం చేయాలో కూడా అర్థం కాని దుస్థితిలో మేమున్నాం. దాన్ని నిర్వహించాలంటే ఏనుగును మేపినంత ఖర్చు అవుతుంది" అని ఎద్దేవా చేశారు. "నాడు కబ్జాలు, కూల్చివేతలు ఉంటే.. నేడు హక్కులు, భరోసా ఇస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, భయం నుంచి భరోసా వైపు, నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం" అని ఆయన ఉద్ఘాటించారు.

**విశాఖ ఇక విశ్వనగరం.. నీటి సమస్యకు ఎన్డీయే గ్యారెంటీ!**

విశాఖపట్నం భవిష్యత్తుపై చంద్రబాబు స్పష్టమైన దార్శనికతను ఆవిష్కరించారు. "రాబోయే రోజుల్లో విశాఖ ఒక విశ్వనగరంగా మారబోతోంది. ఇది ఇక అన్‌స్టాపబుల్. గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అనేక ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది" అని ఆయన ప్రకటించారు.

విశాఖ నీటి సమస్యపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ, "ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గినా, ముందుచూపుతో మేము పూర్తి చేసిన పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీళ్లు తెచ్చాం. ఇప్పుడు అదే కాలువను విశాఖ వరకు పొడిగించి, గోదావరి జలాలతో నగర దాహార్తిని శాశ్వతంగా తీర్చే బాధ్యత మా ఎన్డీయే ప్రభుత్వానిది. భవిష్యత్తులో విశాఖకు నీటి కొరత ఉండదు, ఇది మా గ్యారెంటీ" అని చంద్రబాబు గట్టిగా హామీ ఇచ్చారు.

**అభివృద్ధికి అండగా నిలవండి.. 2047 లక్ష్యం మనదే!**

పరిశ్రమలు తెచ్చి అవకాశాలు కల్పించడం తమ బాధ్యత అని, వాటిని అందిపుచ్చుకుని యువత ఎదగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "విశాఖ ఉక్కును కాపాడింది ఎన్డీయే ప్రభుత్వం. రైల్వే జోన్‌ను రియాలిటీగా మార్చింది మేము. పేదరికం లేని సమాజం, ఆర్థిక అసమానతలు తగ్గడమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, 'స్వచ్ఛాంధ్ర'లో భాగస్వాములు కావాలని కోరారు. "2047 నాటికి 'వికసిత భారత్'తో దేశం ప్రపంచంలో నంబర్ వన్ అవుతుంది. అదే సమయంలో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంతో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతాం. ప్రపంచంలోనే తెలుగు జాతిని అత్యంత శక్తివంతమైన జాతిగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిదీ" అని పిలుపునిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

- మొదటి పేజీ తరువాయి

అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు.

20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ-గాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

## సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన.. సోమవారం నుంచే!

- మొదటి పేజీ తరువాయి

సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు. మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. పిఠాపురం ప్రజల చిరకాల వాంఛ అయిన రూ. 200 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్, రూ. 118 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జి, రూ. 323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి భారీ పనులకు ఆయన శ్రీకారం చుడతారు. వీటితో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాల కింద పలు తాగునీటి ప్రాజెక్టులకు కూడా పచ్చజెండా ఊపనున్నారు.

ఈ అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా పవన్ ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలను అందజేయనున్నారు. ఉప్పాడ తీరప్రాంత

మత్స్యకారులకు ఆధునిక లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించనున్నారు. అదేవిధంగా, 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలు అందించి వారి భూములపై హక్కులు కల్పించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన ద్వారా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పవన్ కల్యాణ్ పటిష్ఠమైన పునాదులు వేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కర్ణాటక పర్యటనలో అమిత్ షాకు అస్వస్థత

- మొదటి పేజీ తరువాయి

మహాస్వామిగళు మూరుసవిర్మఠ్ మెడికల్ కాలేజీ నూతన భవనాన్ని, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా ప్రారంభించాల్సి ఉంది. రూ. 700 కోట్ల వ్యయంతో ఈ మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమం నిమిత్తం షెడ్యూల్ ప్రకారమే శుక్రవారం రాత్రి ఆయన హుబ్బళ్లి చేరుకుని ఒక హోటల్‌లో బస చేశారు. అయితే, శనివారం ఉదయం ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అమిత్ షా గైర్హాజరీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యా శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనారోగ్య కారణాల వల్లే అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే స్పష్టం చేశారు.

## మానవత్వం చాటుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- మొదటి పేజీ తరువాయి

అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళ్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రమాదాన్ని గమనించి.. వెంటనే తన వాహనాన్ని నిలిపి భద్రతా సిబ్బందితో కలిసి కారు వద్దకు వెళ్లారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీసేందుకు సహకరించారు. తీవ్రంగా గాయపడిన కుమార్తెతో పాటు ఆమె తల్లిదండ్రులను తన భద్రతా సిబ్బంది వాహనంలో వెంటనే ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర మంత్రి సూచించారు.

## ఏపీ అమ్మాయిలు టీమిండియాలో ఆడాలి

- మొదటి పేజీ తరువాయి

సంతోషాన్ని పంచుకున్నారు. "మంగళగిరిలో తొలి మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉంది. యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి డబ్ల్యూఏపీఎల్ బలమైన పునాది వేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీరాజ్‌కు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారిణులకు డబ్ల్యూఏపీఎల్, ఆ తర్వాత టీమిండియాకు ఆడే మార్గాన్ని సుగమం చేస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను లోకేశ్ అభినందించారు. టోర్నీలో పాల్గొంటున్న నాలుగు జట్లకు, ప్రతి క్రీడాకారిణికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి భవిష్యత్ ఛాంపియన్లు ఆవిర్భవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.

## కరవులో రైతాంగం.. దోపిడీలో కూటమి ప్రభుత్వం

అధికార పీఠం ఎక్కేందుకు ఊహాజనిత హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా పక్కనబెట్టేసిందని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు అందక, సరైన ప్రణాళికలు లేక కరవు కోరల్లో చిక్కుకుని రైతాంగం అల్లాడిపోతుంటే... కూటమి నాయకులు మాత్రం పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచుకోవడంలో నిమగ్నమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో జగన్ అందించిన పారదర్శక సంక్షేమ పథకాల కంటే మిన్నగా పథకాలు ఇస్తామంటూ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు ఇప్పుడు ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ అశాస్త్రీయ విధానాలు, మోసపూరిత వైఖరిపై నియోజకవర్గాల వారీగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఇప్పటికే పలు ప్రాంతాల్లో బాధితులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రజాగ్రహం నుంచి తప్పించుకునేందుకే కూటమి నాయకత్వం ప్రతిరోజూ కొత్త నాటకాలకు తెరలేపుతోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని పేర్ని నాని హెచ్చరించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# బంధవీధి జీటీడబ్ల్యూఏ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

**ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన నిశాంతి**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**జి.మాడుగుల మండలం బంధవీధి గ్రామంలోని జీటీడబ్ల్యూఏ పాఠశాలను జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, ఐఏఎస్ శనివారం సందర్శించారు. పాఠశాలలోని స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్‌ను పరిశీలించి, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న వయసులో విద్యార్థులకు అందించే విద్య, బోధించే విలువలు వారి జీవితాంతం గుర్తుండిపోతాయని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను పెంచుతూ 100 శాతం ఫలితాల సాధన దిశగా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.మంచి పనితీరు కనబరుస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు



ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, ఆర్డీఓ భుజంగరావు, జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో జనసేన విజయమే లక్ష్యం

- **నాదెండ్ల మనోహర్**
- **స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయమే లక్ష్యం**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 19 :**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా, సమన్వ యంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా క్షేత్రస్థాయి నుంచి నాయకులు, కార్య కర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచిం చారు.విశాఖపట్నంలోని సాగరమాల కన్వెన్షన్ లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశానికి జనసేన పార్టీ విశాఖప ట్నం నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షత వహిం చారు.ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మా ట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గం, మండ లం, గ్రామం, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. ప్రజలతో నిరం తరం మమేకమవుతూ వారి సమస్యలను గు ర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచిం చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆయన అన్నారు. తమకు అప్ప గించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహి స్తూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు, సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని నా దెండ్ల మనోహర్ తెలిపారు. పార్టీ నిర్ణయాల కు కట్టుబడి, ఆదేశాలను తూచా తప్పకుండా పా టిస్తూ ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగాల ని సూచించారు.కూటమి ప్రభుత్వం చేపడుతు న్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమ స్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధినేత ఆశయాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేం దుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ఈ సమావేశంలో జనసేన పార్టీ విశాఖ రూరల్ అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు స్థాయి నాయకులు, జన సైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొ న్నారు. పార్టీ బలోపేతం, ప్రజలతో మమేకం, పార్టీ ఆదేశాలకు కట్టుబాటు లక్ష్యాలుగా ముందుకు సాగి.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసే న విజయానికి సమష్టిగా కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.


# జోలపుట్టు, కులబీరులలో అన్న సంతర్పణ కార్యక్రమాలు

**వినాయక చవితి సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 19.**వినాయక చవితి వేడుకల సందర్భంగా ముంచంగిపుట్టు మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. యువజన సంఘాలు, స్థానిక ప్రజలు మరియు భక్తుల సహకారంతో మండపాల వద్ద ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వందలాది మంది భక్తులకు మహా ప్రసాదంగా రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారు. మండలంలోని జోలపుట్టు పంచాయతీ కేంద్రంతో పాటు, జర్జుల పంచాయితీ కులబీరులో వినాయక చవితి సందర్భంగా భారీ అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వైసిపి మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, నాయకులు రాంప్రసాద్, అర్జున్, జగదీష్ తెలిపారు. వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ఈ అన్న సంతర్పణలలో కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కాగా మండలంలో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జనం పూర్తయ్యాయి.

# దేవరపల్లిలో డిడిఓ పర్యటన





**వర్షంలోనూ అభివృద్ధి పనుల పరిశీలన**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19**:గూడెంకొత్తవీధి మండలంలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) జయప్రకాష్ పర్యటించారు. ఇందులో భాగంగా దేవరపల్లి పంచాయతీలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ, క్లాప్ మిత్రుల పనితీరు, పంచాయతీ సిబ్బంది విధులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.





**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ పర్యటన పట్టాల పంపిణీ కార్యక్రమ**

# ఆర్కే బీచ్ లో సాగర స్వచ్ఛతకు
# సీఎం చంద్రబాబు శ్రీకారం

**1,200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపే లక్ష్యం.. మత్స్యకారులకు ప్రోత్సాహకం అందజేత**



**విశాఖ తూర్పు పెన్ పవర్, సెప్టెంబర్ 19:** స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విశాఖ ఆర్కే బీచ్ లో నిర్వహించిన సాగర స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు,స్కూబా డైవర్లతో ముఖాముఖి నిర్వహించారు. సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చేపల వేటతో పాటు ప్లాస్టిక్ సేకరణతో అదనపు ఆదాయం వస్తోందని మత్స్యకారులు సీఎంకు తెలిపారు. సముద్ర ఉపరితలంలో సేకరించిన వ్యర్థాలకు డిజిటల్ తూకం వేసే విధానాన్ని పరిశీలించి, సేకరణకు ప్రోత్సాహకాన్ని మత్స్యకారులకు స్వయంగా అందజేసారు. సాగర తీరంలో మురి మిక్చర్ విక్రయిస్తున్న మహిళను పలకరించిన సీఎం, ఆమె జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె విక్రయించే మురి మిక్చర్ ను ఆస్వాదించారు. ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకుని పెన్షన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఎంవిపి రైతుబజార్‌లో మంత్రి నాదెండ్ల పర్యటన



**రాయితీ బియ్యం నాణ్యతను స్వయంగా పరిశీలించిన మంత్రి**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 19:** ఎంవీపీ రైతుబజార్‌ను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం సందర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఉన్నారు.రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన పౌర సరఫరాల శాఖ రాయితీ బియ్యం కౌంటర్‌ను మంత్రి తనిఖీ చేశారు. అక్కడే ఉన్న వినియోగదారులతో మాట్లాడి బియ్యం నాణ్యతపై ఆరా తీశారు. తక్కువ ధరకే మంచి నాణ్యత గల బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీఎం) పి.సుధాకర్, డీఎస్‌ఓ వి.భాస్కర్‌రావు, ఉప సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ కిరణ్, ఇంజినీరింగ్ విభాగం ఈఈ, డీఎం సృజన, జనసేన నాయకులు, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.


# పేదలకు పట్టాభిషేకం.. తర్వాత పంచగ్రామాల వంతు!

- **విశాఖలో 28,445 కుటుంబాలకు శాశ్వత హక్కు - మరో 22 వేల కుటుంబాలకు త్వరలోనే పట్టాలు ఇస్తామన్న సీఎం చంద్రబాబు**

**విశాఖ తూర్పు, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**విశాఖ నగర చరిత్రలోనే అతిపెద్ద భూ క్రమబద్ధీకరణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటూ పట్టా లేక అభద్రతతో జీవిస్తున్న పేదలకు సీఎం చంద్రబాబు నాయుడు కొండంత భరోసా ఇచ్చారు.

**పంచగ్రామాల ఆశలకు రెక్కలు**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. నగరంలో ఇంకా 35 కాలనీల్లో 10 వేల కుటుంబాలు పట్టాలు లేకుండా ఉన్నాయని, అత్యంత జటిలమైన పంచగ్రామాల సమస్యలో 12,149 కుటుంబాలు ఇంకా నిరీక్షణలో ఉన్నాయని తన దృష్టికి వచ్చిందన్నారు.





"పేదలు స్వేచ్ఛగా బతకాలి, ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు. వారి ఆత్మగౌరవానికి భంగం కలగకూడదు. 40 ఏళ్ల నాటి పంచగ్రామాల సమస్యతో సహా మిగిలిన 22 వేల కుటుంబాలకు కూడా వీలైనంత త్వరలోనే న్యాయం చేసి శాశ్వత హక్కు కల్పిస్తాం" అని సీఎం హామీ ఇచ్చారు. దీంతో పంచగ్రామాల ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి.

# ఎనిమిదేళ్లుగా పక్షవాతంతో మంచానికే పరిమితం

- **ఐదుగురు కుమార్తెలతో కుటుంబ పోషణ భారంగా మారింది**
- **ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం కోరాపల్లి దావీదు వేడుకోలు**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19**:ఎనిమిదేళ్లుగా పక్షవాతంతో మంచానికే పరిమితమై, ఐదుగురు కుమార్తెలతో కుటుంబాన్ని పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోరాపల్లి గ్రామానికి చెందిన గేమ్మెలి దావీదు కుటుంబం ప్రభుత్వ సహాయం కోసం వేడుకుంటోంది.గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ పరిధిలోని కోరాపల్లి గ్రామానికి చెందిన దావీదు పక్షవాతం కారణంగా కదలలేని పరిస్థితిలో ఉన్నారు. ఆయన భార్య గేమ్మెలి శాంతికుమారి ఐదుగురు కుమార్తెలు దీవెన కుమారి, దీపిక, కరుణ, దివ్య, వైష్ణవితో కలిసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కుటుంబానికి స్థిరమైన ఆదాయ వనరు లేకపోవడంతో రోజువారీ అవసరాలు తీర్చుకోవడం కూడా భారంగా మారిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పిల్లల చదువు, వైద్యం, నిత్యావసర ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. దావీదు ఆరోగ్య పరిస్థితి కారణంగా ఉపాధి పొందే అవకాశం లేకపోవడంతో కుటుంబ భారం మొత్తం భార్యపైనే పడిందని పేర్కొన్నారు.తమ పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా (సీఎం రిలీఫ్ ఫండ్) ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దావీదు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. తమ కుటుంబ పరిస్థితిని అధికారులు పరిశీలించి, అర్హత మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం, ఆర్థిక తోడ్పాటు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు."ఎనిమిదేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాం. ఐదుగురు ఆడపిల్లలతో జీవనం సాగించడం ఎంతో కష్టంగా ఉంది. ప్రభుత్వం మా పరిస్థితిని పరిశీలించి ఆదుకోవాలి" అని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# ఎస్సీ కాలనీలో 'ఆపరేషన్ వజ్రప్రహార్'



✸ 230 ఇళ్ల తనిఖీ.. 440 మంది వివరాల సేకరణ

**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 19) :** అనకాపల్లి జిల్లా ఎస్పీ, విశాఖపట్నం రేంజ్ ఐజీ ఆదేశాల మేరకు నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నర్సీపట్నం టౌన్, రూరల్ పోలీసులు, ఈగిల్ టీమ్, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ 'బన్నీ' సహకారంతో శనివారం ఎస్సీ కాలనీలో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో సుమారు 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాలనీలోని 230 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, 440 మంది వివరాలను సేకరించారు. డ్రగ్స్ వినియోగంపై అనుమానాలున్న 8 ఇళ్లు, పాత ఎన్‌డీపీఎస్ కేసు నిందితుడి ఇంటిని ప్రత్యేకంగా తనిఖీ చేశారు. అలాగే రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు చెందిన ఐదుగురి ప్రస్తుత పరిస్థితి, కార్యకలాపాలపై వివరాలు సేకరించారు. నార్కోటిక్ డాగ్ 'బన్నీ' సహాయంతో అనుమానిత ఇళ్లు, ప్రదేశాలు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా 31 మోటార్‌సైకిళ్లు, ఒక ఆటోను తనిఖీ చేసి వాటికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పి. శ్రీనివాసరావు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబం, సామాజిక జీవితంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి విద్య, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజల భద్రతను కాపాడటం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టడం, నేర కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచడం కోసం ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ ఆపరేషన్ లో డి.ఎస్.పి తో పాటు నర్సీపట్నం టౌన్ సిఐ గఫూర్, రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్సైలు రమేష్, ఉమామహేశ్వరరావు, రాజారావు, దామోదర్, రామారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మజ్జివలస ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఆదివాసి మాతృభాష పాఠ్యపుస్తకాల పంపిణీ..

✸ మాతృభాష వాలంటరీ మజ్జి మనిషా. ఆధ్వర్యంలో అందచేత.



**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్ 19 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం మజ్జివలస ఎంపీపీ ఎస్ పాఠశాలలో మాతృభాష వాలంటరీ మజ్జి మనీషా ఆధ్వర్యంలో ఎంపీపీ ఎస్ పాఠశాల హెచ్ఎం కాంచన చేతులు మీదుగా ఈ పుస్తకాలను అందజేశారు. గిరిజన ప్రాంత మాతృభాష లిపిని సృష్టించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో పుస్తకాలను ముద్రింప చేసి ఒకటవ తరగతి మరియు రెండవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు తద్వారా విద్యార్థిని విద్యార్థులకు మాతృభాషపై సరైన అవగాహన పెరుగుతుందని. అలాగే గిరిజన మాతృభాషలపై మక్కువ పెరుగుతుందని భావితరాలకు మాతృభాషను అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని మాతృభాష వాలంటరీలు అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్ మజ్జి మనిషా సురేష్ కుమార్ జానకి రాణి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## చీకట్లో మగ్గుతున్న ఆదివాసి గ్రామాలు

✸ వీధిలైట్లు మూలన చేరాయనీ, నూతన వీధిలైట్లు మండల వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కు వినతి పత్రం.

✸ ముంచంగిపుట్టు మండల అఖిలపక్ష నాయకులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 19.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల వ్యాప్తంగా కొన్ని ఆదివాసి గ్రామాలు వీధిలైట్లు లేక చిమ్మ చీకట్లో మగ్గుతున్నాయని, తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 23 పంచాయితీలలో 375 గ్రామాలకు వీధిలైట్లు నూతనంగా ఏర్పాటు చేయాలన్నారు. గతంలో అమర్చిన వీధిలైట్లు మరమ్మతులు గురై స్తంభాల మీద దర్శనమిస్తుందనీ, పంచాయతీ నిధులు కేటాయించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి పన్ను చెల్లిస్తున్న గిరిజనులకు కనీసం వీధిలైట్లునైనా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని, గ్రామాలలో అధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆరోపించారు. వీధిలైట్లు లేకపోవడంతో గ్రామాలలో దొంగతనాలు, నేరాలు జరిగే అవకాశం ఉందని, విష జంతువులు సంచరిస్తాయని, వీధి కుక్కల భయం గ్రామ ప్రజల్లో నెలకొందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎంపీడీవోకు వినతి పత్రం ఇచ్చిన వారిలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్, వైసిపి నాయకుడు సిహెచ్ పాపారాయుడు, సిపిఎం నాయకుడు కొర్ర త్రినాథ్, ఎన్ఎస్యుఐ నాయకుడు వెంగడ జగన్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రం--128 ద్వారా వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. ప్రవేశాలకు 2026 అక్టోబర్ 13 చివరి తేదీగా పేర్కొన్నారు. అధ్యయన కేంద్రం ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎల్ఐఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బీఏలో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్; పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కాంబినేషన్లు అందుబాటులో ఉన్నాయి. బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ కాంబినేషన్లు ఉన్నాయి. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు, ఐటీఐ, డిప్లమా, రెండేళ్ల పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకు అర్హులని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ పి. కోటేశ్వరరావు తెలిపారు. బీఎల్ఐఎస్సీ ఒక సంవత్సరం కోర్సుకు డిగ్రీ ఉత్తీర్ణులై 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ ఙఙఙ.నతీఎతీుశీబ.ఖఎ.అఅ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం అధ్యయన కేంద్రం ప్రతినిధి కె. అప్పలనాయుడును 9490458695, 7382929728, 9494372020 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## జర్రెలలో సెప్టెంబర్ 21న పీజీఆర్ఎస్‌సమస్యలపై అర్జీలు స్వీకరణ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గూడెంకొత్తవీధి మండలంలోని జర్రెల స్వర్ణ గ్రామ సచివాలయంలో సెప్టెంబర్ 21న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ఎంపీడీవో బిహెచ్‌వి రమణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు మండలంలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో రమణబాబు సూచించారు.

## ఏకలవ్య క్లస్టర్--2 క్రీడా పోటీల్లో జీకేవీధి విద్యార్థుల సత్తా

### 17 బంగారు పతకాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్లస్టర్--2 స్థాయి క్రీడా పోటీల్లో గూడెంకొత్తవీధి పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అరకు వేదికగా సెప్టెంబర్ 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్--2 క్రీడా పోటీల్లో జీకేవీధి పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో జీకేవీధి పాఠశాల విద్యార్థులు ఇప్పటివరకు వివిధ క్రీడా విభాగాల్లో 17 బంగారు పతకాలు సాధించారు. అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి క్లస్టర్--2 స్థాయి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమణారావు తెలిపారు. క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల విజయానికి సహకరించిన క్రీడా ఉపాధ్యాయులను కూడా అభినందించారు.



విద్యార్థులు చూపిన ప్రతిభ పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.

## 65వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర



-ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో వార్డు లు ప్రగతి

**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్19** జీవీఎంసీ 65వ వార్డు వికాస్ నగర్, భవానీ నగర్ ప్రాంతాల్లో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు,కూటమి నేతలు, జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు . అనంతరం స్వచ్ఛతను పాటిస్తూ,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛమైన పరిసరాలతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వార్డు అభివృద్ధి చెందటానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు .కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రట్టి వాసు,కనక మహాలక్ష్మి ఆలయ డైరెక్టర్ కాకి స్వరూపారాణి,వెంకటేశ్వరరావు,నక్కా భాస్కరరావు,దాట్ల శ్రీనివాసరాజు,ప్రజారోగ్య సిబ్బంది,వివిధ సచివాలయాల సిబ్బంది,ఆర్పీలు,ఆశా ,ఆరోగ్య శాఖ కార్యకర్తలు పాల్గొని చీపుర్లు పట్టి రోడ్లను ఊడ్చారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన కుటుంబం



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా రింతాడ అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తున్నారు. రింతాడ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇద్దరు గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఆహ్వానించి సంప్రదాయబద్ధంగా వేడుక నిర్వహించారు. గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోహిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. "పోషకాహారం -- ఆరోగ్యకరమైన కుటుంబానికి పునాది" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## తోటలగోంది గ్రామంలో వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

గణనాథుని సన్నిధిలో ఘనంగా అన్నసంతర్పణ..
విద్యార్థులకు ఆటల పోటీలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** గూడెంకొత్తవీధి మండలంలోని మొండిగెడ్డ పంచాయతీ పరిధి తోటలగోంది గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం గణనాథుని సన్నిధిలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ ఆడాప ప్రియాంక, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధనను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తోటలగోంది ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. అనంతరం వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేశారు.

# పట్టాల పంపిణీకి కార్యక్రమానికి తరలివెళ్ళిన ప్రజానీకం

**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్19** జీవీఎంసీ 66 వార్డ్ నుండి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పట్టాల పంపిణీకి కార్యక్రమానికి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా జి ఓ నెంబర్ 296 388 30 45 పట్టాలు తీసుకోవడానికి లబ్ధిదారులకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టాలు పొందుతున్న లబ్ధిదారు లను ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్ కు బస్సులో తరలిస్తున్న 66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ , గోమాడవాసు, ఎండి ముర్తాజ, అన్సర్ వల్లి, నంబారు రమణ, సి ఓ వనజ సచివాలయ సిబ్బంది బస్సులో తరలించారు .



# స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం




**అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 19:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని శనివారం అరకు వ్యాలీ మండలంలోని ఎండపల్లివలస గ్రామంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ చైర్మన్ దొన్ను దొర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో కే.వి. సత్యనారాయణ, సిడిపిఓ లక్ష్మీ లావణ్య,మండల పార్టీ అధ్యక్షులు లకోయి మహదేవ్, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఏ.వై. పాత్రుడు, స్థానిక నాయకులు, స్వర్ణ గ్రామ సిబ్బంది, పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు మరియు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాల్గొన్న వారందరూ స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ నెల స్వర్ణంధ్ర స్వచ్ఛంద కార్యక్రమానికి "గ్రీన్ ఆధర్, కూల్ ఆంధ్ర," అనే థీమ్‌ను నిర్దేశించారు. పచ్చదనం పెంపొందించడం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యాలుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, భాగస్వామ్యంతో అవగాహన కల్పించారు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలు, డంప్‌యార్డులు మరియు ప్రజా స్థలాలను పచ్చదనం, పబ్లిక్ స్పేస్‌లుగా అభివృద్ధి చేయడం.

సైక్లింగ్, నడక మరియు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించడం. ప్రభుత్వ భవనాల్లో సౌర విద్యుత్ మరియు ఇంధన సామర్థ్య లైటింగ్ వినియోగాన్ని ప్రోత్సహించడం.

బహిరంగంగా చెత్త దహనం చేయడం, దుమ్ము మరియు అధిక వేడి ఉత్పత్తి చేసే కార్యకలాపాలను తగ్గించడం. హోమ్ కంపోస్టింగ్, వ్యర్థాల తగ్గింపు మరియు పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం. పర్యావరణహిత జీవన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమాల ద్వారా అరకు వ్యాలీ మండలంలో పచ్చదనం పెంపు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు.


## పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత-ఎంపీడీవో రమణబాబు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19**:గ్రామాల్లో పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు సూచించారు. గూడెంకొత్తవీధి మండలంలోని సంకాడలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య సిబ్బంది సూచించిన ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. తద్వారా గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పవచ్చని తెలిపారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ కళ్యాణ్, పంచాయతీ ప్రత్యేక అధికారి, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సొంత కార్యకర్తలను కాదనుకోవడం వైకాపా దౌర్భాగ్యం.

**వైకాపా నేతల తీరుపై జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ధ్వజం.**



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 19.**ఏజెన్సీలో జనసేనలోకి వస్తున్న వలసలను చూసి ఓర్వలేకనే వైకాపా నేతలు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. ఇటీవల జనసేనలో చేరిన వారు తమ కార్యకర్తలు కారంటూ వైకాపా నేతలు పత్రికల్లో తప్పుడు ప్రకటనలు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కన్న పిల్లలు ఎవరో తల్లిదండ్రులకు తెలుస్తుందని, కానీ వారే మా పిల్లలు కారని చెబితే ఆ పరిస్థితి ఎంత దౌర్భాగ్యమో.. ఇప్పుడు వైకాపా స్థానిక నేతల తీరు కూడా అలాగే ఉందని ఎద్దేవా చేశారు. వైకాపా అసమర్థ నాయకత్వం, దౌర్భాగ్యపు పాలన చూసి విసుగుచెందే బలపం పంచాయతీ పరిధిలోని రాళ్లగెడ్డ, కప్పగొంది, మూల కొత్తూరు గ్రామాలకు చెందిన కార్యకర్తలు ఆ పార్టీకి విముక్తి పలికి జనసేనలో చేరారని ఆయన స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఎలా నాశనమైందో ప్రజలందరికీ తెలుసని, అందుకే సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి బ్రహ్మరథం పట్టారని బుజ్జిబాబు గుర్తుచేశారు. నాడు వైకాపా ప్రభుత్వ హయాంలో సర్పంచులకు ఇచ్చిన నిధులను సైతం వెనక్కి లాగేసుకుని, వారిని రోడ్డున పడేసి భిక్షాటన చేసే స్థాయికి దిగజార్చిన విషయం వైకాపా నేతలు అప్పుడే మర్చిపోయారా? అని నిలదీశారు. అలాంటి నాయకులకు జనసేన గురించి, పార్టీలో చేరే వారి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే పంచాయతీరాజ్ శాఖ మంత్రి హోదాలో పవన్ కల్యాణ్ పంచాయతీలకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో వైకాపా సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో ఎక్కడెక్కడ అభివృద్ధి చేశారో గుండె మీద చేయి వేసుకుని చెప్పగలరా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మభ్యపెట్టాలని చూస్తున్న వైకాపాకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. వైకాపా నాయకులు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు ఇక నమ్మే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి విజయకేతనం ఎగురవేయడం ఖాయమని బుజ్జిబాబు ధీమా వ్యక్తం చేశారు.

## సెప్టెంబర్ 25న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

**అక్టోబర్ 5న మాప్-అప్ డే**




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19**:అల్లూరి సీతారామరాజు జిల్లాలో సెప్టెంబర్ 25న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, అక్టోబర్ 5న మాప్-అప్ డే నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, ఐఏఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంపై శనివారం పాడేరు కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు, కిశోర బాలబాలికలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 25న మాత్రలు తీసుకోలేకపోయిన వారికి అక్టోబర్ 5న మాప్-అప్ డే సందర్భంగా అందించాలని సూచించారు.వైద్య ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు నిర్ణీత తేదీల్లో ఆల్బెండజోల్ మాత్రలు అందేలా సహకరించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 87వ వార్డు స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**కూర్మన్నపాలెం:పెన్ పవర్,సెప్టెంబర్19 :**
మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధిలో వడ్లపూడి ఆర్ హెచ్ కాలనీ కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణాంధ్ర -స్వచ్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా మాజీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం , మెడికల్ ఆఫీసర్ స్వరూప రాణి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అన్ని పీ హెచ్ సి లలో నిర్వహించడం జరుగుతుందన్నారు . వడ్లపూడి ఆర్ హెచ్ సి కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతంలో శుభ్రపరచడం జరుగుతుందన్నారు . అంటువ్యాధులు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని అన్నారు. అనంతరం బొండా జగన్నాథం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిరోజు వస్తున్న చెత్త బండికి మన ఇంట్లో వాడే చెత్త చెదారం అందజేయాలని మన పరిసరాలు శుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యకరమైన జీవితం జీవించవచ్చని అన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచంధ్ర ప్రతిజ్ఞ చేయించారు .ఈ కార్యక్రమంలో వార్డ్ సెక్రటరీ బొట్టా ప్రకాష్, గెద్దాడ రాంబాబు, పోతల కృష్ణ, గెద్దాడ అప్పారావు, మింది గోవింద, బొండా సూరిబాబు, ఎస్. అప్పారావు, శ్రీరాములు, హాస్పటల్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఎరకమ్మ చెరువు శుభ్రతకు శ్రీకారం....

- జాబూజాబూలో భాగంగా ఎదీ + =బావీ + కార్యక్రమం......
- 80 మంది వేతనదారులతో చెరువు శుభ్రత.....



**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 19):**పారిశుధ్య పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను సంరక్షించి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో జాబూజాబూలో భాగంగా ఎదీ + =బావీ + కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా నాతవరం మండలం డి.ఎర్రవరం పంచాయతీ పరిధిలోని ఎరకంపేట గ్రామంలో ఉన్న సుమారు 16 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఎరకమ్మ చెరువులో శుభ్రత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది వేతనదారులు పాల్గొని చెరువులోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగిస్తూ శ్రమదానం చేశారు.ఈ సందర్భంగా తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు,కాలువలు, ఇతర నీటి వనరులను,పరిరక్షించేందుకు ఇటువంటి కార్యక్రమాలను చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. సత్య శ్రీనివాస్, తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, డి.ఎర్రవరం మాజీ గ్రామ సర్పంచ్ ఇనుపచప్పల సత్యవతి, డిప్యూటీ ఎంపీడీవో కె. మూర్తిబాబు పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు.అలాగే సచివాలయ సిబ్బంది,వెలుగు శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఎదీ + =బావీ + సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మత్తు పదార్థాల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమం.




**సిఐ విజయ్ కుమార్. మరియు ఎస్ఐ. దుర్గాప్రసాద్.**

**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్ 19 :** అల్లూరి సీతారామ రాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో శనివారం వారపు సంత లో సైబర్ క్రైమ్,రోడ్ ప్రమాదాలు ,గంజాయి మత్తు పదార్థాలు,ఫోక్సో కేసులు, వంటి వాటి పై సీఐ విజయ్ కుమార్ మరియు ఎస్ఐ దుర్గ ప్రసాద్ అవగాహన కల్పించారు మత్తు పదార్థాలు వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని హుకుంపేట సిఐ విజయ్ కుమార్, ఎస్ఐ దుర్గాప్రసాద్ అన్నారు అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో యువకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా గంజాయి వంటి మత్తు పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని సూచించారు గ్రామాలలో గంజాయి సాగు చేయడం విక్రయించడం లేదా వినియోగించడం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అయన తెలిపారు అలాగే ఇతర రాష్ట్రాలకు చెందిన అనుమానాస్పద వ్యక్తులు గ్రామాలలో కంచరిస్తే పోలీస్ శాఖ వరకు తెలియజేయాలని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రిపుల్ రైడింగ్ మరియు ప్రమాదకరమైన వాహన చోధనం చేయకూడదని మత్తుపదార్థాలు సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తద్వారా ప్రాణాపాయ స్థితికి చేరుకోవాల్సి వస్తుందని. హెచ్చరించారు అలాంటి ఘటనలు కుటుంబాలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా యువతతో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలకు సహకరించకూడదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐ విజయ్ కుమార్ మరియు ఎస్ఐ దుర్గాప్రసాద్మరియు పోలీస్ సిబ్బంది గ్రామ యువత ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## డ్రోన్ కెమెరాలతో పోలీసుల నిఘా



- గంజాయి నివారణే లక్ష్యం.
- ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 19.**అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు పాడేరు డిఎస్పీ రాజసింహారెడ్డి సమక్షంలో ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుమూల గ్రామాలు కొండ ప్రాంతాల్లో అక్రమ గంజాయి సాగును అరికట్టడమే లక్ష్యంగా పోలీసులు గగనతల నిఘా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని నేతృత్వంలో పోలీస్ సిబ్బంది ఏపిఎస్పీ బలగాలు మరియు సర్టిఫైడ్ డ్రోన్ ఆపరేటర్‌తో కలిసి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరాల ద్వారా నిర్దేశిత పాయింట్ల వద్ద గగనతల తనిఖీలు చేపట్టారు. కొండ ప్రాంతాలు అటవీ భూములలో అత్యాధునిక డ్రోన్ల ద్వారా గాలించగా సదరు తనిఖీ పాయింట్ల వద్ద ఎలాంటి గంజాయి సాగు లేదా తోటలు ఉన్నట్లు ఆధారాలు లభించలేదని ఎస్ఐ నాని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బార్దర్, డిఎస్పీ రాజసింహారెడ్డి మార్గదర్శకాల ప్రకారం గంజాయి సాగు మరియు రవాణాపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని, మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తే డ్రోన్ సాంకేతికత ద్వారా సులభంగా గుర్తిస్తామని, అక్రమ సాగుకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## కూటమి ఐక్యతతో స్థానిక ఎన్నికలను ఎదుర్కొందాం

**జీకేవీధి మండల కూటమి నాయకులకు పి. కొండలరావు పిలుపు**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జీకేవీధి మండలంలోని 16 పంచాయతీల పరిధిలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మండల అధ్యక్షుడు పి. కొండలరావు కోరారు.ఈ మేరకు శనివారం ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, పాడేరు నియోజకవర్గ పార్టీ అధిష్టానాల సూచనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు.ఎవరికి పార్టీ టికెట్ లభించినా మిగిలిన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సహకరించాలని కోరారు. పార్టీల సిద్ధాంతాలు, నిబంధనలకు కట్టుబడి, పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. రెబల్ అభ్యర్థులను నిలబెట్టకుండా కూటమి ఐక్యతను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు.మండలంలోని 16 పంచాయతీల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో ఎన్నికల



ప్రక్రియలో పాల్గొనాలని పి. కొండలరావు విజ్ఞప్తి చేశారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం -- ఆపదలో 1098కు సమాచారం ఇవ్వాలి

**జీకే వీధి కేజీబీవీలో బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాల్య వివాహాల నిరోధం, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు బాలల రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం పరిరక్షణ అధికారులు కమిడీ రాజశేఖర్, న్యాయ సహాయ మరియు పరిశీలన అధికారి అశోక్ కుమార్, సామాజిక కార్యకర్త శాంతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల బాలికలకు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు.పాఠశాల స్థాయిలో బాలికలు ఎదుర్కొనే రక్షణ సమస్యలు, పోక్సో చట్టంలోని ముఖ్యమైన అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పిల్లలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు, లేదా తమకు తెలిసిన ప్రాంతంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందినప్పుడు వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ధనలక్ష్మి, అశోక్, కేజీబీవీ ప్రిన్సిపాల్ గొర్లె లావణ్య సరస్వతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గర్భిణులకు వరం.. జనన నిరీక్షణ కేంద్రం.


- కోరుకొండ పీహెచ్‌సీలో నూతన భవనం ప్రారంభం




**చింతపల్లిపెన్ పవర్ సెప్టెంబర్ 19.** మన్యంలో గర్భిణుల సౌకర్యార్థం చింతపల్లి మండలం కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన 'జనన నిరీక్షణ కేంద్రం' అందుబాటులోకి వచ్చింది. బలపం పంచాయతీ పరిధిలోని ఈ భవనాన్ని శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. పంచాయతీ మాజీ సర్పంచ్ కె.రమేష్ నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు బచ్చలి మచ్చుమ్మ చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. సుదూర గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులకు ప్రసవ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ముందుగానే ఆసుపత్రికి చేరుకుని సురక్షితంగా ఉండేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ సంతోష్, ఆరోగ్య సిబ్బందితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వైకాపా నాయకులు జి.మోహన్, బి.బాబురావు, మోహన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, లక్ష్మణ్, బాబురావు, మచ్చయ్య, అలాగే కూటమి పక్ష నాయకులైన తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రావు, టీడీపీ ఎస్టీ సెల్ కమిటీ మండల కార్యనిర్వాహక కార్యదర్శి గోపినాయక త్రినాథ్, జనసేన నాయకులు రంగారావు, చిట్టిబాబు తదితరులు హాజరయ్యారు.

## జడ్పిటిసి, ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్లు తుది జాబితా..!

- మండల అభివృద్ధి అధికారి "జెడివి ప్రసాదరావు"



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 19:** మండలంలో ఎంపీటీసీ జడ్పీటీసీ పోలింగ్ స్టేషన్లు తుది జాబితాను మండల అభివృద్ధి కార్యాలయంలో ప్రదర్శించడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి జెడివి ప్రసాద్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలింగ్ స్టేషన్లో తుది జాబితాను మండల అభివృద్ధి కార్యాలయం తో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యాలయాల్లో కూడా ప్రజలు పరిశీలనార్థం ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. వీటిపై ప్రజలు వివిధ రాజకీయ పార్టీలు అభ్యర్థులు పోలింగ్ స్టేషన్లో వివరాలను ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశీలించవచ్చని ఈ సందర్భంగా ఎంపీడీవో జెడివి ప్రసాద్ రావు తెలిపారు.

## ప్రజలు, పోలీసులు భాగస్వామ్యం గా ఉంటే నేరాలు నియంత్రణ...!

- లూసం లో ఆపరేషన్ వజ్రాహార్ లో భాగంగా కార్టన్ చర్ఛ్
- కొయ్యూరు సీఐ" బి శ్రీనివాసరావు" "ఎస్సై కిషోర్ వర్మ"




**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 19:** ప్రజలు పోలీసులు భాగస్వామ్యంతో పనిచేస్తే నేరాలను అరికట్టి మాదకద్రవ్య రహిత సురక్షిత సమాజాన్ని నిర్మించవచ్చని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలో మర్రివాడ పంచాయతీ లూసంలో కాటన్ చర్చ్ ఆపరేషన్ నిర్వహించారు ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ వర్మ మాట్లాడుతూ... ఆపరేషన్ లో భాగంగా నేరాలు నివారణ మాదకద్రవ్యాలు నియంత్రణ ప్రజల భాగస్వామ్యం ఉన్నట్లయితే పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని వారు అన్నారు. గంజాయి సాగు అక్రమ రవాణా విక్రయం వినియోగం వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు యువత గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అపరిచిత వ్యక్తులు కు ఓటీపీలు బ్యాంకు ఖాతా వివరాలు పాస్వర్డ్ వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకూడదని తెలిపారు అలాగే అనుమానాస్పద లింకు లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు

**రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి :**

వాహనదారు లు రోడ్డు భద్రతపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలో పాటించడం మద్యం లేదా ఇతర మాదకద్రవ్యాలు ప్రభావంతో వాహనాలు నడపకూడదని తెలియజేశారు

**మహిళలు బాలికలు భద్రతపై అవగాహన ఉండాలి :**

సమాజంలో మహిళలు బాలికల భద్రత, మహిళపై జరిగే నేరాలను అరికట్టడంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని ఏదైనా సంఘటన ఎదురైతే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. మారుమూల గ్రామాల్లో సైతం గంజాయి ఇతర మాదకద్రవ్యాలు అక్రమ రవాణా వినియోగం అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఇతర అసాంఘిక కార్యక్రమాలు గుర్తించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. వీటన్నిటికీ ప్రజలు పోలీసులు భాగస్వామ్యంతో పనిచేస్తే నేరాలు నియంత్రణ మాదకద్రవ్యాల రహిత సురక్షిత సమాజాన్ని నిర్మించవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రింతాడ బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం

- ఐదుగురు విద్యార్థులకు మలేరియా పరీక్షలు -- అందరికీ నెగిటివ్




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19**:గూడెంకొత్తవీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఋషిశ్రీ ఆధ్వర్యంలో రింతాడ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న ఐదుగురు విద్యార్థులకు మలేరియా పరీక్షలు నిర్వహించగా, ఎవరికీ మలేరియా లేదని వైద్యాధికారులు నిర్ధారించారు. అలాగే గజ్జి, తామర, జలుబు, దగ్గు తదితర స్వల్ప అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మందులను వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ఆరోగ్య అవగాహన కల్పించారు. తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమతెరలు వినియోగించాలని, భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. చేతి గోళ్లను పొట్టిగా కత్తిరించుకోవడంతో పాటు ప్రతిరోజూ స్నానం చేసి శుభ్రమైన దుస్తులు ధరించాలని తెలిపారు. స్వల్పంగా జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య, సౌఖ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఋషిశ్రీ, బహుళ ఆరోగ్య కార్యకర్త నిర్మల, ఏఎన్ఎం యోగిత, ఆరోగ్య సహాయకుడు ఎం. సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమిత్ర, వసతి గృహ వార్డెన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పట్లో గంజాయి సాగు... నేడు సాంప్రదాయ పంటలు...!



కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ వెల్లడి

**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ ఆదేశాల మేరకు, గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాలపై నిఘా మరియు పరిశీలనలో భాగంగా బాకులూరు, బోయవుట, ఎస్.ఆర్.పాలెం గ్రామాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించడం జరిగింది అని కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ వెల్లడించారు. శనివారం మండలంలోని ఈ డ్రోన్ సర్వేలో గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించగా, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఎటువంటి గంజాయి సాగు ఉన్నట్లు గుర్తించబడలేదు, ఇప్పుడు రైతులు సాంప్రదాయ పంటలు వేస్తున్నారని ఈ సందర్భంగా తెలియపరిచారు . ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం

ఘనంగా పోషణ మాస ఉత్సవాలు



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 19 ) :** పోషణ మాసోత్సవాల్లో భాగంగా వేములపూడి అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంపై అవగాహన తల్లి, బిడ్డ ఆరోగ్యానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని సీడీపీఓ రమణి వివరించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఇతర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. తల్లి, బిడ్డ ఆరోగ్యమే లక్ష్యంగా గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నారులకు వయసుకు తగిన పౌష్టికాహారం అందించాలని అవగాహన కల్పించారు. పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు ఆషాజ్యోతి, రేవతి, దేవుడమ్మ, దేవి, విజయలక్ష్మి, అంగన్వాడీ సహాయకులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19:** పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తరచూ తరగతి గదులతో పాటు కళాశాల ఆవరణ, ఉద్యానవనం, క్రీడా మైదానాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త పి. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెలలో నిర్దేశించిన పరిశుభ్రత లక్ష్యాల మేరకు చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రం చేసినట్లు తెలిపారు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థులు చొరవ చూపాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి జి. గౌరీ శంకరరావు ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులతో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రంథాలయం ముందు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు కళాశాల ఉద్యానవనంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జానకిరామ్, డాక్టర్ సునీత, డాక్టర్ గౌతమి, జేకేసీ సమన్వయకర్త పి. కామేశ్వరరావు, ప్రసాద్, డాక్టర్ బి. రామకృష్ణ, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల ఆస్తికి పట్టాలే భరోసా:భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



**విశాఖ తూర్పు పెన్ పవర్, సెప్టెంబర్ 19:** పేదల భూమికి,ఇంటికి భరోసా కల్పించడమే ఇళ్ల పట్టాల పంపిణీ లక్ష్యమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. నగరంలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నివాస భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు ఇవ్వడం ద్వారా పేదల భవిష్యత్తుకు భద్రత లభిస్తుందన్నారు. ఇది వారి జీవితాల్లో పండుగ రోజని అభివర్ణించారు. చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ నేడు విశ్వనగరంగా ఎదిగిందని, హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దినట్లే విశాఖను అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో విశాఖలో 63 వేల పట్టాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేస్తోందని, కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ - ట్రిపుల్ ఇంజిన్ గ్రోత్ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, కూటమి ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## అంగన్వాడీ లో పోషణ్ మాసం -- 2026



**కూర్మన్నపాలెం: పెన్ పవర్, సెప్టెంబర్ 19** అంగన్వాడీ అందరి బాధ్యత కార్యక్రమం పెందుర్తి ప్రాజెక్టు మంగళపాలెం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఆహార వైవిధ్యం గురించి ప్రోటీన్లతో కూడిన ఆహారం యొక్క విలువలు గురించి తల్లులకు మరియు బాలికలకు తగినంత అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్ చెల్లాయమ్మ, డీఆర్పిలు, లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్ బిందు నాగ లక్ష్మి, వడ్డదీ మూడో వీధి ప్రతినిధి కుశాల్ ప్రాజెక్టు ప్రతినిధి కలవతి,గోవింద, షర్మిల, . వరలక్ష్మి పోషకవిలువల పై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు .

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


- పెదగూడలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం.
- ముంచంగిపుట్టు ఎస్సై పి నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 19.** మండలంలోని పెదగూడ ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు చట్టాలు, భద్రత మరియు పోలీసు వ్యవస్థపై అవగాహన, చదువుతో పాటు విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ముంచంగిపుట్టు ఎస్సై పి నాని తెలిపారు. అభ్యాస్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు చదువుపై నైపుణ్యం పెంచేలా పలు కార్యకలాపాలు నిర్వహించారు. విద్యార్థులందరికీ క్రమశిక్షణ, సైబర్ భద్రత, పోక్సో చట్టం, మహిళలు-పిల్లల సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గంజాయి, గుట్కా వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల పక్కనే ఉన్న మత్స్యగెడ్డ వద్దకు వెళ్లి నీటిలో దిగవద్దని ప్రాణాపాయం ఉందని ఎస్సై హెచ్చరించారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని ఎస్సై సూచించారు.

# పేదలకు పట్టాల పంపిణీ.. పండుగ చేసుకుంటున్న లబ్ధిదారులు

**తూర్పు నియోజకవర్గంలో సందడి.. ఏ యు గ్రౌండ్ కు తరలిన కాలనీవాసులు**



కనకదుర్గ నగర్ కాలనీలకు చెందిన లబ్ధిదారులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు సెక్రటరీ, 26వ బూత్ ఇంచార్జి గొపల్లి రామకృష్ణ, మహిళా అధ్యక్షురాలు ఇల్ల లక్ష్మి,ఆర్పీ దిలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 19**: పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనడానికి నిదర్శనంగా తూర్పు నియోజకవర్గంలో పట్టాల పంపిణీ కార్యక్రమం స పట్టాలు ఇచ్చిన చోటే పూర్తిస్థాయి డాక్యుమెంట్లను అందజేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది.
అభివృద్ధి, సంక్షేమం అంటే చంద్రబాబు నాయుడు. పాలనలోనే సాధ్యమని మరోసారి రుజువైందని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘనత తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకే దక్కుతుందని ఆయన కృషి వల్లే తమ కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**బస్సులో బయలుదేరిన ప్రజలు:**

శనివారం నిర్వహించిన పట్టాల డాక్యుమెంట్ల పంపిణీ కార్యక్రమానికి సచివాలయం-2 పరిధిలోని ప్రజలు బస్సులో ఏ యూ గ్రౌండ్ బయలుదేరి వెళ్లారు. 12వ వార్డు అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు పర్యవేక్షణలో అంబేద్కర్ న్యూ కాలనీ,రాజీవ్ నగర్,

## ఐదు రోజుల తర్వాత అరుదైన రక్తం లభ్యం

**బాంబే ఫినోటైప్ రక్తదానం చేసిన పాడేరు యువకుడు**



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 19:**అరుదైన బాంబే ఫినోటైప్ రక్తం అవసరమైన పదేళ్ల బాలుడికి ఐదు రోజుల అనంతరం రక్తదానం చేసి పాడేరు యువకుడు జయసూర్య నారాయణ మానవత్వాన్ని చాటుకున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ కొండజర్త గ్రామానికి చెందిన బచ్చలి లోవరాజు (10)కు ఆరు రోజుల క్రితం జ్వరం రావడంతో దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు మలేరియా మరియు రక్తహీనతగా గుర్తించి మెరుగైన వైద్యం కోసం చింతపల్లి కేంద్రీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో అత్యవసరంగా విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు.కేజీహెచ్‌లో నిర్వహించిన రక్త పరీక్షల్లో బాలుడికి అత్యంత అరుదైన బాంబే ఫినోటైప్ రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. విశాఖపట్నంలో ఎంత ప్రయత్నించినా ఆ రక్తం లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.ఈ విషయం తెలుసుకున్న పాడేరు వాసి జయసూర్య నారాయణ స్పందించి బాంబే ఫినోటైప్ రక్తాన్ని దానం చేశారు. ఐదు రోజుల అనంతరం అరుదైన రక్తం లభించడంతో బాలుడికి అవసరమైన చికిత్స అందుతోంది. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆపద సమయంలో స్పందించి అరుదైన రక్తాన్ని అందించిన జయసూర్య నారాయణకు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసి బాలుడి చికిత్సకు సహకరించిన ఆయన సేవలను పలువురు అభినందించారు.

## వలసలు వాస్తవమే. నిజం చూసి ఓర్వలేకనే వైకాపా నేతల అక్కసు.



**400 మంది చేరిక వాస్తవమేనని స్పష్టీకరణ.**

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 19.**జనసేన పార్టీలోకి వైకాపా శ్రేణులు భారీగా తరలివస్తుండటాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని జనసేన మండల నాయకులు పాంగి లింగారావు, కొర్ర రంగారావు, సింధేరి చిన్నయ్య, వంతల గంగరాజు, సింహాద్రి విమర్శించారు. జనసేనలో చేరిన వారు తమ కార్యకర్తలు కారంటూ బలపం పంచాయతీ ఎంపీటీసీ బచ్చలి మచ్చమ్మ, మాజీ సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు పత్రికల్లో తప్పుడు ప్రకటనలు ఇవ్వడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైకాపా నేతల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ఎంపీటీసీ, సర్పంచ్ పదవులు వారు ఎలా పొందారో పంచాయతీ ప్రజలందరికీ తెలుసని, ఆ విషయం మర్చిపోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని జనసేన నేతలు ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో తమ బంధువులు సాయుధ మావోయిస్టులుగా ఉన్నారని చెప్పి, ఆ పేరుతో జులుం ప్రదర్శించి ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసిన వాస్తవం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఎవరినీ నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకుని, పదవులు దక్కించుకున్నారని ఆరోపించారు. పదవిలో ఉన్నన్నాళ్లు వార్డు మెంబర్లకు కనీస విలువ ఇవ్వలేదని, ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలను లెక్కచేయలేదని మండిపడ్డారు. గ్రామాల్లో ఏమేరకు నిధులు వెచ్చించారో కనీసం వార్డు మెంబర్లకు ఎందుకు చెప్పలేదో సమాధానం చెప్పాలన్నారు. నాడు 'గడప గడపకు' కార్యక్రమంలో ప్రజల సమస్యలపై జనసేన తరపున అర్జీలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే, వాటిని ఎందుకు స్వీకరించలేదని నిలదీశారు. జనసేనలో చేరింది కేవలం 30 మంది కాదని, రాళ్లగడ్డ, జోహార్, ఆర్.జి.కొత్తూరు, మూల కొత్తూరు, కప్పగొంది, కృష్ణవరం, బలపం తూరు మామిడి, బూరుగు బయలు, దిగువ వలసపల్లి తదితర గ్రామాల నుంచి సుమారు 400 మందికి పైగా వైకాపాను వీడి తమ పార్టీలో చేరారని స్పష్టం చేశారు. జనసేన కండువా కప్పుకున్న వారిలో 7వ వార్డు సభ్యుడు సీదరి సోమరాజు, 12వ వార్డు సభ్యుడు పాంగి రంగారావులు వైకాపా నుంచి గెలిచిన వారు కాదా? అని నిలదీశారు. పార్టీలో చేరిన వారందరి జాబితా తమ వద్ద ఉందని, ఎలాంటి ఆధారాలు లేకుండా తాము పత్రికా ప్రకటనలు ఇవ్వబోమని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా గెలిచే ప్రసక్తే లేదని తాము జనసైనికులుగా సవాల్ విసురుతున్నామన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు గణేష్, పి.రమణ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

## స్థానికసంస్థల ఎన్నికల్లో బిజెపికి అవకాశం కల్పించాలి...!

**కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మేడి బోయిన చక్రావు( చిన్న)**




**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 19:**రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలో జడ్పీటీసీ టికెట్ బీజేపీ పార్టీ కి కేటాయించాలని బీజేపీ కిషాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిబోయిన చక్రావు (చిన్న ) కోరారు. శనివారం అయన విలేఖర్లతో మాట్లాడారు. మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న బిజెపి పార్టీకి జడ్పిటిసి టికెట్ కేటాయిస్తే గెలుపు తధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. కూటమి నేతలు గుర్తించి బీజేపీ పార్టీ నేతలకు మండలంలో అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల తో పీఎం జన్మన్ నిధులతో మారుమూల గ్రామాలకు రహదార్లు తో పాటు స్వచ్చమైన త్రాగునీరు జల జీవన్ మిషన్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో బిజెపి పార్టీకి మండలంలో గుర్తింపు కలిగిందన్నారు. ఏజెన్సీలో ప్రతి గ్రామానికి అందిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పూర్తిగా సహకారం అందిస్తుందన్నారు.. కూటమి నేతలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పొత్తు ధర్మాన్ని పాటించి సీట్లు కేటాయించాలని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రావు (చిన్న) కోరారు.

# దళితుల భూముల జోలికి వస్తే ఉద్యమిస్తాం



**భూముల వ్యవహారంలో పారదర్శకత పాటించాలి**

**విశాఖ, పెన్ పవర్, సెప్టెంబర్ 19 :** దళితులు, బడుగు బలహీన వర్గాలు, రైతులకు సంబంధించిన భూముల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున పోరాడు తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మం చా నాగమల్లేశ్వరి అన్నారు. విశాఖపట్నం మద్ది లపాలెం కృష్ణా కాలేజ్ రోడ్డులోని జిల్లా పార్టీ కా ర్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరు ల సమావేశంలో ఆమె మాట్లాడారు.దశాబ్దాల క్రితం ప్రభుత్వం దళితులు, బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన భూములపై ప్రస్తుతం వివిధ రకాలుగా హక్కులు కోల్పోయే పరిస్థితు లు ఏర్పడుతున్నాయని ఆమె ఆరోపించారు. పేదలు, అణగారిన వర్గాలకు కేటాయించిన భూములను వారి నుంచి దూరం చేసే ప్రయత్నా లను తమ పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు.
భోగాపురం పరిసర ప్రాంతాల్లోని పలు సర్వే నంబర్ల భూముల విషయంలో ప్రజల్లో ఆందోళ నలు ఉన్నాయని పేర్కొన్న ఆమె, ముఖ్యంగా సర్వే నంబర్లు 17, 27, 30, 33, 59 తదితర భూములపై వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. కొండపాలెం, బండిపాలెం ప్రాంతాలకు చెందిన 189, 191 తదితర సర్వే నంబర్ల భూముల విషయంలోనూ పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.భూముల స్వభావం, పట్టాలు, యాజ మాన్య హక్కులు, బదలాయింపులు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని నాగ మల్లేశ్వరి అన్నారు. సర్వే నంబర్ వారీగా భూ ముల వివరాలు, యాజమాన్య హక్కులు, ప్రభుత్వ రికార్డులు, జరిగిన లావాదేవీలను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ఆయా భూములు ఎవరికి సంబంధించినవి, వాటిపై ఎవరి హక్కులు ఉన్నాయి, ఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తు న్నారన్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని ఆమె తెలిపారు. ప్రజా సమస్యలను ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని, వారిపై రాజకీయ ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. దళితు లు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలు, రైతులకు సంబంధించిన భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఆమె కోరారు. భూముల రికార్డులను సమగ్రంగా పరిశీలించి, ఎక్కడైనా అన్యాయం జరిగినట్లు తేలితే బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దళితులు, బడుగు బలహీ న వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితు ల్లోనూ పేదలు, దళితులు, బలహీన వర్గాలకు సంబంధించిన భూముల సమస్యలపై తమ పార్టీ వారి పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు.భూములపై వస్తున్న ఆరోపణలు, ప్రజల్లో నెలకొన్న అనుమానాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని నాగమల్లేశ్వరి కోరారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు."దళితులు, బడుగు బలహీన వర్గాల భూముల జోలికి వస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. ప్రజల హక్కుల పరిర క్షణ కోసం అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతు ల్లో ఉద్యమం చేపడతాం" అని ఆమె హెచ్చరిం చారు. పేదల భూముల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పునఃపరిశీలించి, అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## అప్పట్లో గంజాయి సాగు... నేడు సాంప్రదాయ పంటలు...!

**కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ వెల్లడి**



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 19:** అప్పట్లో గిరి గ్రామాల్లో గంజాయి చేసేవారని నేడు అదే గ్రామాల్లో సాంప్రదాయ పంటలు పండిస్తున్నారని కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ ఆదేశాల మేరకు, గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాలపై నిఘా మరియు పరిశీలనలో భాగంగా బాకులూరు, బోయవుట, ఎస్.ఆర్.పాలెం గ్రామాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించడం జరిగింది అని కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ తెలిపారు. శనివారం మండలంలోని ఈ డ్రోన్ సర్వేలో గతంలో గంజాయి సాగు జరిగిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించగా, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఎటువంటి గంజాయి సాగు ఉన్నట్లు గుర్తించబడలేదు, ఇప్పుడు రైతులు సాంప్రదాయ పంటలు వేస్తున్నారని ఈ సందర్భంగా తెలియపరిచారు . ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్సార్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 19:** జీవీఎంసీ 13వ వార్డు,పైనాపిల్ కోలని, జే ఎన్ ఎన్ యు ఆర్ ఎం కాలనీలో వైఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలోవినాయక చవితి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన అన్న సమారాధన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు, పాల్గొన్నారు పాల్గొన్నారు. వైసిపి వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్,రాజబాబు, వానపల్లి ఈశ్వరరావు. ప్రసంగి వాసు, కాలనీవాసులు సమీప ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.


## అల్లూరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలి
- ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు డిమాండ్



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 19**: అల్లూరి సీతారామరాజు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, వర్షాభావంతో నష్టపోయిన గిరిజన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు డిమాండ్ చేశారు.పాడేరు మండలం డి.గొందురు పంచాయతీలోని పంట పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు సాగు చేయలేక ఇబ్బందులు పడుతున్న రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ఇబ్బందులను ఎమ్మెల్యే ఎదుట వివరించారు.రెండు నెలలుగా సమయానికి వర్షాలు కురవకపోవడంతో వరి నాట్లు వేయలేకపోయామని, వాణిజ్య పంటలు కూడా సాగు చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ పంట నష్టంపై ఇప్పటివరకు సమగ్ర సర్వే నిర్వహించకపోవడం ఆందోళనకరమన్నారు.అల్లూరి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వర్షాభావ పరిస్థితులపై తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు వ్యవసాయ రుణాల విషయంలో తగిన ఉపశమనం కల్పించి గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి కూడ సురేష్ కుమార్, ఐటీ విభాగం సంయుక్త కార్యదర్శి కూడ సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ వనుగు బసవన్న దొర, సిరగం దశమూర్తి, నాయకులు ముంచంగి రాజం నాయుడు, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.ం

## డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



**జి.మాడుగుల.పెన్ పవర్.సెప్టెంబర్ (19)** జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) ఎం. రియాజ్ బేగ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయో వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ గదిని పరిశీలించి మందుల లభ్యత, పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. ల్యాబ్‌ను సందర్శించి రోజువారీగా ఎన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారో ఆరా తీశారు. ఈ ఏడాది నమోదైన మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి గ్రామాల్లో చేపడుతున్న వైద్య సేవలు, మలేరియా నివారణ చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీటీఎల్ఓ కిరణ్‌కుమార్‌తో కలిసి కొత్తూరు గ్రామాన్ని సందర్శించి అక్కడి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వ్యాధుల నియంత్రణ చర్యలను పర్యవేక్షించారు.

# విశాఖ చరిత్రలోనే ఇదొక సుదినం



**పేదల కలలను నిజం చేస్తూ రూ. 15,000 కోట్ల విలువైన శాశ్వత ఆస్తి పత్రాల పంపిణీ**

**ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు గణబాబు**

ఉపాధి, ఉద్యోగాల కోసం విశాఖ నగరానికి వచ్చి కొండలు, ప్రభుత్వ భూములను ఆశ్రయిం చి దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న పేద ప్రజల కు సంపూర్ణ యాజమాన్య హక్కులతో కూడిన శాశ్వత ఆస్తి పత్రాలు అందజేయడం విశాఖ చరిత్రలోనే ఒక సువర్ణాధ్యాయమని విశాఖప ట్నం పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు గణ బాబు పేర్కొన్నారు.శనివారం జరిగిన ఆస్తి పత్రా ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ తరతరాల నిరీక్షణకు శాశ్వత పరిష్కారం విశాఖ నగరంలో పోర్టులు, డిఫెన్స్, రైల్వే వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు భూములు కేటాయిం చగా, వలస వచ్చిన పేదలు కొండలు, నిరుప యోగ ప్రభుత్వ భూముల్లో గూడు కట్టుకున్నా రు. తాతల కాలం నుంచి అనధికారికంగా జీవి స్తూ, ఎప్పుడు ఏ ముప్పు వస్తుందోనన్న బిక్కు బిక్కుమంటూ గడిపిన పేద ప్రజల కష్టాలను గుర్తించి ప్రభుత్వం శాశ్వత భరోసా కల్పించింది.

**జీవోల అమలు -- తిరుగులేని యాజమాన్య హక్కులు:**

గతంలో 2014-19 మధ్య సీఎం నారా చంద్ర బాబు నాయుడు 100 గజాల లోపు నివాసా లకు సంపూర్ణ హక్కులు కల్పించేలా జీవో 296, 388లను తీసుకువచ్చారు. రెండేళ్లలో కన్వేయె న్స్ డీడ్స్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయాలని ఆనాడే నిర్ణయించగా, గత ప్రభుత్వం ఆ ఫైళ్లను అటకె క్కించింది. మళ్లీ ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే జీవో నెం. 30ని తీసుకొచ్చి జీవో 296, 388లతో పాటు గాజువాక జీవో 45, యూ ఎల్ సీ జీవో 84 పరిధిలోని బాధితులకు భారత రా జ్యాంగ ముద్ర, సబ్ రిజిస్ట్రార్ స్టాంపుతో పూర్తి ఆస్తి పత్రాలు అందజేస్తున్నాం.

రూ. 15,000 కోట్ల మార్కెట్ విలువైన సంపద పేదల పరం:లి నగరంలో 26,000 పైచిలుకు కుటుంబాలకు రిజిస్టర్డ్ విలువ ప్రకారమే రూ. 8,800 కోట్లు, మార్కెట్ విలువ ప్రకారం సుమా రు రూ. 15,000 కోట్ల విలువైన ఆస్తులను పేదలకు ఉచితంగా కట్టబెట్టిన ఘనత చంద్రబా బు నాయుడు ప్రభుత్వానికే దక్కుతుంది. ఆర్థిక భరోసా,పిల్లల భవిష్యత్తుకు రక్షణ గతం లో ఇచ్చే డీ-ఫామ్ పట్టాలపై ఎలాంటి హక్కులు ఉండేవి కావు, బ్యాంకులు రుణాలు ఇచ్చేవి కావు. నేడు చేతికి అందుతున్న ఈ శాశ్వత ఆస్తి పత్రాలతో బ్యాంకుల నుంచి రుణాలు పొంది పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవ చ్చు. ఈ ఆస్తి పత్రాలు నేటికే కాకుండా రాబోయే తరాలకు, పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక రక్షణగా నిలుస్తాయి.

**గత పాలకుల వైఖరిపై విమర్శలు**

గత పాలకులు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ప్రజల ఆస్తులను లాక్కోవాలని చూశారని, పట్టాలపై తమ ఫొటోలు ముద్రించుకుని ప్రచా రం చేసుకున్నారని ధ్వజమెత్తారు. పేదలపై చెత్త పన్ను వేసి వేధించారని, పేదవాడి కడుపు నింపే అన్నా క్యాంటీన్లను సైతం మూసివేసి పైశాచిక ఆనందం పొందారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ రూ. 5లకే అన్నా క్యాం టీన్లను పునరుద్ధరించామని తెలిపారు.

విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతున్న లోకేష్: ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో ప్రపంచంలోనే అగ్రగామి సంస్థ అయిన 'గూగుల్' విశాఖ నగరానికి వచ్చిందని, యువతకు భారీ గా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా నగ రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతు న్నామని స్పష్టం చేశారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, పేదల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వానికి ప్రజలం తా అండగా నిలవాలని ఈ సందర్భంగా గణబా బు పిలుపునిచ్చారు.

# విశాఖ ప్రజల దాహం తీర్చలేని దుర్మార్గపు కూటమి పాలన

**నీటి కోసం అల్లాడుతుంటే రాజకీయ విమర్శలా? - స్టీల్ ప్లాంట్ భవిష్యత్తు ఏమైంది? భూములన్నీ బినామీలకేనా?**

**మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫైర్**

**గుక్కెడు నీటి కోసం విశాఖ వాసులు అలమటిస్తుంటే సీఎం చంద్రబాబుకు పట్టదా?**



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 19,**విశాఖ ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం అల్లాడుతుంటే నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నీటి సమస్యను పట్టించుకోకుండా ప్రతిపక్షంపై రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. శు క్రవారం విశాఖలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.విశాఖలో 3-4 రోజులకోసారి నీరు వచ్చే దుస్థితి నెలకొందని, ట్యాంకర్ల ద్వారా కొనుక్కుందామన్నా నీరు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముడసర్లోవ, మేదరగడ్డ, రైవాడ రిజర్వాయర్లు ఎండిపోయాయని, తాడిపూడి నుంచి నీరు రావడం లేదని, పోలవరం నీరు అనకాపల్లి వరకు వచ్చిందని చెబుతున్న ప్రభుత్వం ఆ నీటిని విశాఖకు ఎందుకు తీసుకురాలేకపోతోందని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలైన పెన్షన్లు వద్దు, రూ.1500 వద్దు, రూ.15 వేలు వద్దు, కనీసం మంచినీళ్లు ఇవ్వండి అని ప్రజలు రోడ్డెక్కే పరిస్థితి తెచ్చారని విమర్శించారు.

**విశాఖ భూములు బినామీలకు దోచిపెడుతున్నారు:**

2024లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విశాఖలో వేల కోట్ల విలువైన భూములను ఊరూ పేరు లేని బినామీ కంపెనీలకు కట్టబెట్టారని ఆరోపించారు. వందల ఎకరాలు ఇచ్చినా ఒక్క కంపెనీ అయినా నిర్మాణం చేపట్టిందా? స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చిందా? అని నిలదీశారు. ఇచ్చినవన్నీ రియల్ ఎస్టేట్ కంపెనీలేనని, విశాఖ అభివృద్ధి చెందితే అమరావతి రియల్ ఎస్టేట్‌కు దెబ్బ తగులుతుందనే కుట్రతోనే విశాఖను చంపేస్తున్నారని ధ్వజమెత్తారు.

**స్టీల్ ప్లాంట్‌పై మోసం:**

స్టీల్ ప్లాంట్‌కు రూ.1000 కోట్లు, రూ.10 వేల కోట్లు, రూ.20 వేల కోట్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆ డబ్బు బ్యాంకు రుణాల వేలం ఆపడానికా? కార్మికులను ఆదుకోవడానికా? చెప్పాలన్నారు. 6500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారని, పర్మినెంట్ ఉద్యోగులకు ఎ=ూ ఇచ్చారని, రెండున్నరేళ్లలో 10-12 వేల మందిని తొలగించారని, 4 నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఉద్దేశం లేకపోతే ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

**పట్టాల డ్రామా:**

జగన్ గారి ప్రభుత్వం +ూ 463, +ూ 225, +ూ 60 ద్వారా రూ.16 వేల కోట్లు భరించి పేదలకు భూములు రెగ్యులరైజ్ చేసిందని, విశాఖలోనే 1.30 లక్షల కుటుంబాలకు స్థలాలు ఇచ్చామని, ఆ ఇళ్ల నిర్మాణాలను ఈ ప్రభుత్వం అడ్డుకుని ఇప్పుడు అవే పథకాలను కొత్తవిగా స్టంట్ చేస్తోందని విమర్శించారు.

ఈ కీలుబొమ్మ ప్రభుత్వానికి ప్రజలే త్వరలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# 28,445 కుటుంబాలకు సొంతింటి భరోసా




**జిల్లా చరిత్రలో సువర్ణ అధ్యాయం గా నిలిచే కార్యక్రమం కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 19 :** పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా చేపట్టిన ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడుల పంపిణీ కార్యక్రమం జిల్లా చరిత్రలో సువర్ణ అ ధ్యాయంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అన్నారు.శనివారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 19,33,852.66 చదరపు గజాల విస్తీర్ణంలో సుమారు 400 ఎకరాల భూ మిని క్రమబద్ధీకరించి, మొత్తం 28,445 మంది లబ్ధిదారులకు రూ.8,874 కోట్ల విలువైన ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడులు అందిస్తు న్నట్లు తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 296, 388, 84, 30, 45 ప్రకారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో అర్హులైన లబ్ధిదారుల కు పట్టాలు, కన్వేయన్స్ డీడుల పంపిణీకి చర్య లు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు.విశాఖపట్నం ఈస్ట్ నియోజకవర్గంలో 6,555 మంది, వెస్ట్‌లో 5,093, నార్త్‌లో 2,601, పెందు ర్తిలో 2,851, గాజువాకలో 6,134, భీమిలిలో 5,211 మంది లబ్ధిదారులు ఈ కార్యక్రమం ద్వా రా ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.రెగ్యులరైజేషన్ స్కీమ్-2025లో భాగంగా జీవో 30 కింద 11,783 దరఖాస్తులను స్వీకరించి, క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అర్హత పొం దిన వారికి పట్టాల పంపిణీ చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే జీవో 45 కింద గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో 943 దరఖాస్తులకు ఆమోదం లభించిందన్నారు.

పట్టా కేవలం కాగితం కాదు ఇళ్ల స్థల పట్టా కేవలం ఒక కాగితం కాదని, అది ఒక కుటుంబానికి భరోసా, ఇంటిపై హక్కు, భవిష్యత్‌పై నమ్మకమని కలెక్టర్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలు స్తోందన్నారు. సొంతింటి కలను నిజం చేసే దిశగా పట్టాల పంపిణీ కీలక ముందడుగని తెలిపారు.

గ్లోబల్ సిటీగా విశాఖ అభివృద్ధికి ప్రాధాన్యం విశాఖపట్నం అభివృద్ధిలో పరిశ్రమలు, ఐటీ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోం దని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 31 ఐటీ సంస్థ లకు భూములు కేటాయించగా, రూ.1.40 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 1.36 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందన్నా రు.డేటా సెంటర్లు, ఎంఎస్ఎంఈలతో పాటు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడిం చారు. విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ విభాగాలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత ఏడాది నిర్వహించిన పార్టనర్‌షిప్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించిన స్ఫూర్తితో ఈ ఏడాది కూడా సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## ఎంపీ సీఎం రమేష్ పై చిల్లర వ్యాఖ్యలు సరికాదు


**గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు**



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 19) :** అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ పై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర నాయకులు పోలవరం జిల్లా ఇంచార్జ్ , నర్సీపట్నం నియోజకవర్గ బీజేపీ నాయకుడు గాదె శ్రీనివాసరావు ఖండించారు. ప్రజలు భారీ మెజారిటీతో ఎన్నుకున్న ఎంపీపై చిల్లర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయాల్లో హుందాతనం పాటించాలని సూచించారు. లోకల్, నాన్‌లోకల్ పేరుతో మాట్లాడటం ద్వారా రాయలసీమ ప్రాంత ప్రజలను, సీఎం రమేష్‌ను గెలిపించిన అనకాపల్లి ప్రజలను అవమానించేలా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. రాజకీయాల్లో ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేసే అవకాశం ఉందని, గతంలో విజయమ్మ ను విశాఖ నుంచి పోటీ చేయించినప్పుడు స్థానికత అంశం ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం వారణాసి నుంచి పోటీ చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవకతవకలు, అభివృద్ధి లోపాల కారణంగానే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని పక్కన పెట్టారని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు పలికిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో చోడవరం సహా పలు ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి దారుణంగా ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులు, మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం లభిస్తోందన్నారు.గుడివాడ అమర్నాథ్ ప్రజాప్రతినిధులపై మాట్లాడేటప్పుడు పదజాలాన్ని అదుపులో పెట్టుకుని హుందాగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని, వ్యక్తిగత విమర్శలకు దిగకుండా వాస్తవాల ఆధారంగా రాజకీయ చర్చ జరగాలని అన్నారు. ఈ సమావేశంలో కాళ్ల సుబ్బారావు, గుమ్మడి గణేష్, అడిగర్ల సతీష్, గవిరెడ్డి చక్రవర్తి, బంగారు నాయుడు, కురస కామేశ్వరరావు పాల్గొన్నారు.

## బంధవీధి జి టి డబ్ల్యు ఏ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ నిశాంతి

**ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్**




**జి.మాడుగుల. పెన్ పవర్ సెప్టెంబర్ (19)** జి.మాడుగుల మండలం బంధవీధి గ్రామంలోని జి టి డబ్ల్యూ ఏ పాఠశాలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి, ఐఏఎస్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్‌ను పరిశీలించి, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఉపాధ్యాయుల్లో కనీస బోధనా నైపుణ్యాలను మరింతగా పెంపొందించేందుకు ప్రతి నెల 3వ మరియు 4వ శనివారాల్లో నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణను నిర్వహించారు. చిన్న వయసులో వేసే పునాది జీవితాంతం గుర్తుండిపోతుంది అని ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ శ్రీమతి నిశాంతి మాట్లాడుతూ, పిల్లలకు చిన్న వయసులోనే అందించే విద్య, బోధించే విలువలు, వేసే మంచి పునాది వారి జీవితాంతం గుర్తుండిపోతాయని అన్నారు. తాను కూడా చిన్నతనంలో బోధించిన ఉపాధ్యాయులను, వారి పేర్లతో సహా ఇప్పటికీ గుర్తుంచుకున్నానని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల స్థాయి ఉపాధ్యాయులను తప్పకుండా గుర్తు చేసుకుంటారని చెప్పారు. ఒక విద్యార్థి జీవితంలో మంచి పునాది వేయడం కంటే ఉపాధ్యాయుడికి గొప్ప సంతృప్తి మరొకటి ఉండదు అని కలెక్టర్ పేర్కొన్నారు. వంద శాతం ఫలితాల దిశగా పనిచేయాలన్నారు.

ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను నిరంతరం సమీక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే బాగా బోధిస్తున్న ఉపాధ్యాయులు మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని,వంద శాతం సాధించిన వారు 120 శాతం లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. తక్కువ స్థాయి ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలను విశ్లేషించుకుని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ప్రత్యేక దృష్టి సారించి మెరుగుపడాలని సూచించారు. అదేవిధంగా మంచి పనితీరు కనబరుస్తున్న ఉపాధ్యాయులను తగిన విధంగా గుర్తించి ప్రోత్సహిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

కలెక్టర్ ప్రసంగం ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపింది. తమ బోధనా సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకుని విద్యార్థుల అభ్యసన ఫలితాలను పెంచేందుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, ఆర్డీఓ శ్రీ భుజంగరావు, జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com